
andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.3, కనిష్ఠం 15.2



ఆదిలాబాద్ జిల్లా వార్తలు

5

శనివారం 24 ఫిబ్రవరి 2024



భాం ఫట్!

ఖాళీ జాగా.. వేసెయ్ పాగా!

- జిల్లా కేంద్రంలో దర్జాగా పార్కు స్థలాల కబ్జా
- ఓల్డ్ హౌజింగ్ బోర్డు పార్కు స్థలంపై హైకోర్టు సీరియస్
- కాలనీ పిల్లలు రాసిన ఉత్తరాలకు స్పందించిన కోర్టు
- తీసుకున్న చర్యలపై నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశం
- ఆలయ పనులను నిలిపి వేసిన మున్సిపల్ అధికారులు
- రెండు వర్గాల మధ్య మరింత ముదురుతున్న వివాదం

ఆంధ్రజ్యోతి ఫోకస్

ఆదిలాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి)

ఖాళీ స్థలాలు కనిపిస్తే చాలు.. కబ్జారాయుళ్లు గుట్టుగా హాంఫట్ చేసేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని హోల్డ్‌హౌజింగ్ బోర్డు కాలనీలో పార్కు స్థలాలు యథేచ్ఛగా కబ్జాకు గురవుతున్నాయి. ఖాళీ జాగా కనిపిస్తే చాలు.. కబ్జా చేసి బోర్డులు పాతేయడం కొంత మందికి అలవాటుగా మారింది. గత కొంత కాలం క్రితమే కైలాస్‌నగర్ కాలనీలో కొంత మంది ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నం చేయగా.. కాలనీ వాసులు అడ్డుకుని చుట్టూ కంచెను ఏర్పాటు చేశారు. ఇలా జిల్లా కేంద్రంలో చాలా చోట్ల ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురై కనిపించకుండానే పోయాయి. అధికారుల నిర్లక్ష్యం పాలకులు పట్టించుకోకపోవడంతో.. ప్రభుత్వ స్థలాలకు రక్షణ లేకుండానే పోయింది. గత కొన్నేళ్లుగా అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా.. పట్టించుకోక పోవడంతో కాలనీ వాసులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం సీరియస్‌గా తీసుకుని పార్కు స్థలం ఆక్రమణలపై ఏం చర్యలు తీసుకున్నారో వెంటనే నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు నోటీసులు జారీ చేసింది. దీంతో బుధవారం మున్సిపల్ అధికారులు ఉరుకులు పరుగులు పెట్టారు. మున్సిపల్ కమిషనర్ కమర్ హైమద్‌తో పాటు టౌన్ ప్లానింగ్ అధికారి అనురాధా హౌజింగ్ బోర్డు పార్కు స్థలాన్ని పరిశీలించి సిబ్బందితో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయించారు. 2006-07 సంవత్సరంలో ఈ పార్కు కంపౌండ్‌వాల్ నిర్మాణానికి మున్సిపల్ అధికారులు రూ.7లక్షలను మంజూరు చేశారు. తిరిగి 2021-22లో రెండు పార్కుల అభివృద్ధికి గాను రూ.25లక్షల చొప్పున రూ.50లక్షలను మంజూరు చేసిన ఇంకా టెండర్ ప్రక్రియను పూర్తి చేయలేదు. దీంతో 2023 డిసెంబర్ 29న హైకోర్టు చీఫ్‌జస్టిస్‌కు హౌజింగ్‌బోర్డు కాలనీకి చెందిన 23 మంది పిల్లలు పార్కు స్థలం కబ్జాపై ఉత్తరాలు రాశారు. దీంతో స్పందించిన హైకోర్టు అధికారులను ఆదేశిస్తూ పార్కు స్థలం కబ్జాకు గురికావడం పై చర్యలు తీసుకోవాలని కోరింది. హైకోర్టు నోటీసులతో అధికార వర్గాలతో పాటు జిల్లా కేంద్రంతో పాటు జిల్లా అంతటా చర్చనీయాంశంగా మారింది.



● కనుమరుగవుతున్న పార్కులు

1970లో హౌజింగ్‌బోర్డు కాలనీని ఏర్పాటు చేస్తూ ప్రజా అవసరాల కోసం లేఔట్ మొత్తం విస్తీర్ణంలో 10శాతం స్థలాన్ని పార్కుల కోసం కేటాయించారు. ఇలా సుమారుగా 1.5 ఎకరాల స్థలాన్ని పిల్లల క్రీడలు, ఆహ్లాదానిచ్చే పార్కుల కోసం కేటాయించారు. కానీ కాల క్రమేణా పార్కు స్థలాలు ఆక్రమణలకు గురై కనుమరుగవుతున్నాయి. ఇప్పటికే చుట్టుపక్కల వారు పార్కు స్థలంలోకి చొచ్చుకు రావడంతో.. ప్రస్తుతం 10నుంచి 15గుంటల భూమి మాత్రమే మిగిలి ఉంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో స్థానిక కాలనీ వాసులే అక్రమ కట్టడాలను చేపడుతున్నారు. హౌజింగ్‌బోర్డు శివాలయాన్ని ఆనుకుని, సరస్వతి శిశుమందిర్ పాఠశాలను ఆనుకుని ఉన్న పార్కులపై కబ్జాదారుల కన్నుపడి కనిపించకుండానే పోతున్నాయి. పట్టణ అభివృద్ధి పేరిట ఎన్నో పనులను చేపడుతున్న మున్సిపల్ అధికారులు పార్కుల అభివృద్ధికి నిధులను కేటాయించక పోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా పిల్లల ఉత్తరాలతో స్పందించిన హైకోర్టు సంబంధిత అధికారుల పని తీరును తప్పుబడుతూ.. మార్చి 7వ తేదీ లోగా తీసుకున్న చర్యలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించింది.

● ఆలయ నిర్మాణంపై అభ్యంతరాలు

హౌజింగ్ బోర్డు కాలనీలో శివాలయాన్ని ఆనుకుని కొంత మంది మరో ఆలయాన్ని నిర్మించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో స్థానిక కాలనీ వాసులు అభ్యంతరాలు చెబుతున్నారు. పిల్లల క్రీడా, పార్కు స్థలానికి కేటాయించిన స్థలంలో ఆలయాలు నిర్మించడం ఏమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే కొంతవరకు ఆలయ నిర్మాణం పనులు కూడా పూర్తయ్యాయి. గతంలోనే కోర్టు ఆదేశాలతో విగ్రహాన్ని తొలగించిన నిర్వాహకులు మళ్లీ గుట్టు చప్పుడు కాకుండా ఆలయ నిర్మాణం పనులను ప్రారంభించారు. గతంలో పార్కు వాచ్‌మెన్ నివాసం కోసం మున్సిపల్ నిధులతో నిర్మించిన గది డోరును కూడా మూసివేసి ఆక్రమించుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. దీంతో నిర్మించిన ఆలయాన్ని తొలగించాలని ఆదేశించలేక.. కోర్టు ఆదేశాలను అమలు చేయలేక అధికారులు సతమతమవుతున్నారు.

▸▸ మితిమీరిన రాజకీయ జోక్యం

పార్కు స్థలాల ఆక్రమణలో రాజకీయ జోక్యం కనిపిస్తోంది. పార్కు స్థలాలను అభివృద్ధి చేయకుండా కొంత మంది స్థానికుల ఒత్తిళ్లతో ఆలయాలు నిర్మించేందుకు మున్సిపల్ కౌన్సిల్ తీర్మాణం చేయడంపై విమర్శలు వస్తున్నాయి. గతంలో అధికారులు అడ్డుకునే ప్రయత్నం చేసిన రాజకీయ ఒత్తిళ్లతో వెనక్కి తగ్గాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించిన వారికి అండగా నిలిచే ప్రయత్నం చేశారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఉద్దేశ్య పూర్వకంగానే హౌజింగ్‌బోర్డు పార్కులను ఏ మాత్రం అభివృద్ధి చేయలేదన్న విమర్శలు వస్తున్నాయి. గతంలో మున్సిపల్ కమిషనర్‌గా పని చేసిన శైలజ ఆక్రమణదారులకు అండగా నిలిచారన్న ఆరోపణలు కూడా లేకపోలేదు. రాజకీయ నేతల ఒత్తిళ్లు పెరిగి పోవడంతోనే పార్కు స్థలాల ఆక్రమణలను అధికారులు అడ్డుకోలేక పోయారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాలనీలోని ఓ వర్గం ఆలయ నిర్మాణానికి మొగ్గు చూపుతుండగా.. మరో వర్గం పార్కు అభివృద్ధికి పట్టుబడుతూ హైకోర్టును ఆశ్రయించడం చర్చనీయాంశంగా మారింది. దీంతో కాలనీలో రెండు వర్గాల మధ్య వివాదం మరింత ముదురుతోంది.

▸▸ హైకోర్టు నోటీసులు అందాయి

- కమర్ హైమద్ (మున్సిపల్ కమిషనర్)

రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం నుంచి నోటీసులు అందాయి. హౌజింగ్‌బోర్డు చిన్నారులు రాసినా లేఖకు హైకోర్టు స్పందించి ఆదేశాలు ఇవ్వడంతో ఆక్రమణలపై విచారణ జరిపిస్తున్నాం. విచారణ ముగిసేంత వరకు ఆలయ నిర్మాణం పనులు తాత్కాలికంగా నిలిపి వేశాం. పార్కు స్థలాలపై సర్వే జరిపించి పూర్తి స్థాయి నివేదికను అందిస్తాం.



హౌజింగ్ బోర్డులోని శిశుమందిర్ పాఠశాలను ఆనుకుని ఉన్న పార్కు స్థలం



పార్కు స్థలంలో నిర్మిస్తున్న ఆలయం ఇదే..



స్థలాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్, అధికారులు



పార్కు స్థలంలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఎమ్మెల్యే లాస్యనందిత మృతి దిగ్భ్రాంతిని కలిగించింది

● మాజీ మంత్రి జోగురామన్న

ఆదిలాబాద్‌అర్బన్, ఫిబ్రవరి23: కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత అకాల మరణం తీవ్రదిగ్భ్రాంతికి గురి చేసిందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగురామన్న అన్నారు. శుక్రవారం జిల్లా కార్యాలయంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎమ్మెల్యే లాస్యనందిత చిత్రపటానికి పూలమాలలు వేసి బీఆర్ఎస్ శ్రేణులు ఘన నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని కోరుతూ సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బండారి సతీష్, సందనర్సింగ్, అశోక్‌స్వామి, భరత్, నాయకులు ఇజ్జగిరి నారాయణ, రోకండ్ల రమేష్, స్వరూపరాణి, కరుణ, దమ్మపాల్, శ్రీనివాస్, రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు వచ్చిన జైళ్ల శాఖ డీజీ

ఆదిలాబాద్‌అర్బన్; ఫిబ్రవరి 23: జైళ్ల శాఖ డీజీసౌమ్య మిశ్రా ఐపీఎస్ ఆదిలాబాద్‌కు వచ్చారు. ఈ సందర్భంగా డీజీని మర్యాద పూర్వకంగా పూలమొక్క అందజేసి డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, వర్టికల్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్‌లు స్వాగతం పలికారు. అదనపు డీజీతో పాటు జైలు శాఖ ఐజీ మురళిబాబు, వరంగల్ రేంజ్ డీఐజీ సంపత్‌కుమార్‌లు జిల్లాకు వచ్చారు. ఇందులో జిల్లా జైలు సూపరింటెండెంట్ అశోక్‌కుమార్, పట్టణ సీఐలు కె.సత్యనారాయణ, ఎ.అశోక్ తదితరులున్నారు.

ప్రతీ మహిళ లక్షాధికారి కావాలి: ఐకేపీ డీపీఎం

తలమడుగు, ఫిబ్రవరి23: ప్రతీ స్వయం సహాయక శాఖ సంఘ సభ్యురాలు లక్షాధికారి కావాలని ఐకేపీ డీపీఎం గంగన్న అన్నారు. శుక్రవారం మండలంలోని సుంకిడి రైతువేదికలో తాంసి, తలమడుగు భీంపూర్ మండలాలకు చెందిన స్వయం సహాయక సంఘ సభ్యురాలకు 2రోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ సభ్యులకు లక్పతి దిదీ (సంఘ సభ్యురాలు లక్షాధికారులు) తయారీ చేయుటకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలను సద్వినియోగం పర్చుకోవాలని కోరారు. సంఘ సభ్యులకు ఇతర సంస్థల నుంచి, బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించి సభ్యురాలు ఏడాదికి కనీసం రూ.లక్ష ఆదాయం వచ్చే విధంగా చూడాలని గ్రామ సంఘం సహాయకులకు తెలియజేశారు. ఇందులో తుమ్మల శ్రీనివాస్, రాపెల్లి స్వామి, ప్రసాద్, రవీందర్, సీసీలు, గ్రామ సంఘం సహాయకులు హాజరయ్యారు.

ఎంపీడీవోను కలిసిన ఎంపీటీసీలు

ఇచ్చోడ ఫిబ్రవరి23: ఇచ్చోడ మండల ప్రజాపరిషత్తు కార్యాలయ అధికారి లక్ష్మణ్‌ను వైస్‌ఎంపీపీ జాలైజాకుతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు నిమ్మల శివకుమార్‌రెడ్డి, జాహెద్, నాయకులు మెరాజ్ అహ్మద్, కళ్లెం సుభాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా క్రీడాకారులకు బంగారు, వెండి పతకాలు

ఆదిలాబాద్‌అర్బన్, ఫిబ్రవరి 23: ఈనెల 21న హైదరాబాద్‌లోని రైల్వే స్టేడియంలో జరిగిన సబ్‌జూనియర్ బాలుర, బాలికల చాంపియన్‌షిప్ పోటీలో జిల్లాకు చెందిన ఐదుగురు క్రీడాకారులు బంగారు, వెండి పతకాలు సాధించారు. ఈ పోటీలో ఆదిలాబాద్ జిల్లాకు చెందిన బాక్సింగ్ టీం సభ్యులు బాలికలలో అబ్దుల్ అపియా జబీన్‌కు బంగారు పతకం,బి.అశ్వినికి వెండి పతకం, ఆర్ అనూషలకు వెండి పతకంతో పాటు బెస్ట్ లూసర్ అవార్డు లభించగా బాలురలో సోయబ్ మాలిక్‌కు బంగారుపతకం, రామ్ చరణ్‌కు సిల్వర్ మెడల్ లభించింది. ఈ క్రీడాకారులు బాక్సింగ్‌లో మెడల్స్ సాధించేందుకు జిల్లాకలెక్టర్‌తో పాటు జిల్లా అధికారులు తమకు మంచి సపోర్టు ఇచ్చారని ఆదిలాబాద్ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం.విజయేందర్, ప్రధాన కార్యదర్శి అక్తర్‌బేగ్‌లు తెలిపారు. బాక్సింగ్ కోచ్ సాయికుమార్‌గౌడ్ విజేతలకు సహకారం అందించారని తెలిపారు. జిల్లాలోని క్రీడాకారులోని ప్రతిభను గుర్తిస్తున్నామన్నారు. పోటీల్లో విజయం సాధించిన ఐదుగురు క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు.

పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాలి: కలెక్టర్

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి23: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ చీఫ్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులకు సూచించారు. ఈనెల 28 నుంచి మార్చి 19 వరకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరిగే ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ పరీక్షల నిర్వహణ పై శుక్రవారం ఇంటర్మీడియట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధులు కేటాయించిన అధికారులు వెంటనే ఆయా పరీక్ష కేంద్రాలను సందర్శించి పర్నీచర్, విద్యుత్, మంచి నీరు, వెలుతురు వంటి మౌళిక సదుపాయాలను పరిశీలించి ఏమైనా లోటుపాట్లు ఉంటే తెలిపితే తగు చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునే విధంగా ఆర్టీసీ బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవడంతో పాటు పరీక్ష కేంద్రాల వద్ద ప్రథమ చికిత్స ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 21527 మంది పరీక్షలు రాయనున్నారన్నారు. వీరి కోసం 30 కేంద్రాలలో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. సీసీ కెమెరా నిఘాలో పరీక్షలు కొనసాగుతాయని, ఎటువంటి మాల్ ప్రాక్టిస్, దుర్వినియోగాలకు అవకాశం ఇవ్వకుండా పరీక్షలు సజావుగా నిర్వహించాలన్నారు. స్మార్ట్‌ఫోన్లు, మొబైల్స్, స్మార్ట్ వాచీలు తదితర ఎలక్ట్రానిక్ గాడ్జెస్ పరీక్ష కేంద్రాలలో అనుమతించబడం జరుగదని తెలిపారు. సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తాయన్నారు. పరీక్ష కేంద్రాలకు సమీపంలో జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని, 144 సెక్షన్ అమలు చేయాలని, పరీక్ష ప్రశ్న పత్రాలు ఓపెనింగ్, జవాబు పత్రాలు ప్యాకింగ్, మొబైల్ ఫోన్ యాప్ అన్ని సీసీ కెమెరా ఆధ్వర్యంలో నిర్వహించాలన్నారు. సమావేశంలో ఇంటర్మీడియట్ నోడల్ అధికారి పరీక్షల విభాగం అధికారులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

● పీఎం విశ్వకర్మ పథకాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలి

ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ పీఎస్ అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీఎం విశ్వకర్మ యోజన పథకంపై పంచాయతీ కార్యదర్శులు, ఎంపీఓలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీఎం విశ్వకర్మ యోజన పథకం కింద వడ్రంగులు, కమ్మరులు,గ ంపలు, చాపలు, చీపరులు వంటి వివిధ పరకారాలర తయారీదారులు, బంగారం పనిచేసేవారు, కుమ్మరులు, శిల్పులు, చర్మకారులు, పాదరక్షల తయారీ దారులు, తాపీ పనివారు, క్షురకులు (నాయివృత్తిదారులు), రజకులు, దర్జీలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నిరుద్యోగ యువత ఈ పథకాన్ని సద్వినియోగం పర్చుకోవాలని సూచించారు. మొదటి విడతలో రూ.లక్ష రుణం మంజూరు చేయడం జరుగుతుందని, నిర్ణీతసమయంలో చెల్లించిన వారికి తిరిగి 2లక్షల రుణం ఇవ్వనున్నట్లు తెలిపారు. అర్హులు అందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. సదస్సులో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ పద్మభూషణ్‌రాజు, జిల్లా పంచాయతీ అధి కారిణి శ్రీలత, ఎల్‌డీఎం భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

'బ్యాక్‌లాగ్ పోస్టులు ప్రకటించి ఏజెన్సీ డీఎస్సీ పెట్టాలి'

ఉట్నూర్, ఫిబ్రవరి23: ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ)లో ఉపాధ్యా య బ్యాక్‌లాగ్ పోస్టులు ప్రకటించి.. ప్రభుత్వం వెంటనే ఏజెన్సీ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చే యాలని ఏజెన్సీ డీఎస్సీ సాధన కమిటీ నాయకు లు డిమాండ్ చేశారు. శుక్రవారం ఉట్నూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో పాదయాత్ర నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి ఏజెన్సీ డీఎస్సీ పెట్టాలని కోరామన్నారు. అయితే అధికారంలోకి వచ్చిన వెంటనే ఏజెన్సీ డీఎస్సీ పెట్టి నిరుద్యోగ గిరిజనులకు ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారని ఏజెన్సీ డీఎస్సీ సాధన కమిటీ కమిటీ సభ్యులు పెందూర్ దీపక్, జాదవ్‌సోమేశ్‌లు తెలిపారు. గత పదేళ్లుగా ఐటీడీఏలో బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమై ందని అన్నారు. 2012నుంచి ఇప్పటివరకు డీఎస్సీలు పెట్టలేదన్నారు. ప్రభుత్వం మెగా డీఎస్సీ లో గిరిజనులకు అధికశాతం ఉద్యోగాలు ఇచ్చేలా, ఏజెన్సీ గిరిజనులకు రిజర్వేషన్లు ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి 100రోజులు కావస్తోందని, వెంటనే తమ సమస్య పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. శుక్రవారం ఐటీడీఏ ముందు ధర్నా చేద్దామని ప్రకటించామని, ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ సీఎంతో చర్చించి డీఎస్సీ ఏర్పాటుకు కృషిచేద్దామనిహామీ ఇవ్వడంతో ధర్నా విరమించుకున్నామని తెలిపారు. సమావేశంలో కిషోర్, అరవింద్, విగ్నేష్, జాలీంశా, తదితరులున్నారు.

'రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తాం'

భీంపూర్, ఫిబ్రవరి 23: పిప్పల్‌కోటి, బోర్లా కుంట నుంచి గోళ్లగడ్ వరకు 5కిలోమీటర్ రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ గోళ్లగడ్ గ్రామాన్ని సందర్శించి గ్రామంలో తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. కొన్నినెలలుగా భగీరథ నీళ్లురావడం లేదని స్థానికులు చెప్పగా అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామస్తులు పోలింగ్ బహిష్కరించవద్దని, బాధ్యతగా ఓటింగ్‌లో పాల్గొనాలన్నారు. కలెక్టర్‌తో తహసీల్దార్ సత్యనారాయణరావ్, ఎంపిడివో గోపాల కృష్ణ, ఎంపీవో సుమేర్, అహ్మద్‌ఖాన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చంద్రశేఖర్, ఆర్ఐ అశోక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎంపీ

బోథ్, ఫిబ్రవరి 23: మండలంలోని అందూర్ గ్రామంలో మృతి చెందిన నైతం జంగుబాయ్, పందరం జంగు బాబులు ఆకస్మికంగా మృతిచెందడంతో వారి కుటుంబాలను మాజీ ఎంపీ కోడం నగేష్ శుక్రవారం పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండల నాయకులు మాజీ సర్పంచ్ రాజేశ్వర్‌రెడ్డి, సహకార సంఘం చైర్మన్ కదం ప్రశాంత్, మాజీ ఎంపీటీసీ రాజేశ్వర్ పెందుర్తి తులసీరామ్, దిగోలే విష్ణు మడవి రామరావు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

దినసరి ఉద్యోగుల సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తా: ఖానాపూర్ ఎమ్మెల్యే

ఉట్నూర్, ఫిబ్రవరి23: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలలో పని చేస్తున్న దినసరి ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ హామీ ఇచ్చారు. శుక్రవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో దినసరి ఉద్యోగులు కలిసి మెమోరాండం సమర్పించి తమ సమస్యలను వివరించారు. తెలంగాణ గిరిజన పాఠశాలలు, వసతి గృహాల దినసరి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి రాథోడ్ బాపురావ్,జిల్లా ప్ర .దాన కార్యదర్శి ఎరుకొండ రాజన్నలు మాట్లాడుతూ సకాలంలో ప్రతినెల వేత నాలు రాక దినసరి ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని, మూడు నెలలకు ఒకసారి బడ్జెట్ కాకుండా ఏడాది బడ్జెట్‌ను ఒకేసారి ఇప్పించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు అక్బర్, రాము, రమేష్, అంజనా బాయి, రాధాబాయి, మధునమ్మ తదితరులు పాల్గొన్నారు.

● ఎమ్మెల్యే లాస్య నందిత మృతి పట్ల ఎమ్మెల్యే సంతాపం

సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం చాలా బాధాకరమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు అన్నారు. శుక్రవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లాస్య చిత్రపటానికి కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఆయన శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ మాట్లాడుతూ.. యువ ఎమ్మెల్యే లాస్యనందిత అకాల మృతి కంటోన్మెంట్ నియోజకవర్గానికి తీరని లోటని పేర్కొన్నారు.

పూజలు అందుకుంటున్న భుడుందేవ్

ఉట్నూర్, ఫిబ్రవరి23: మేస్రం గిరిజనుల దైవం షాంపూర్‌లోని భుడందేవ్ పూజలు అందుకుంటోంది. నాగోబా జాతర అనంతరం మేస్రం గిరిజనులు బుడుందేవ్ జాతరను ప్రారంభించి.. తమ తమ ఇళ్లకు చేరుకున్నారు. వారం రోజుల క్రితం ప్రారంభమైన ఇప్పుడిప్పుడే పుంజుకుంటోంది. ఉట్నూర్ మండలంలోని షాంపూర్‌లో వెలిసిన భుడందేవ్ జాతరలో ఏర్పాటు చేసిన రంగుల రట్నం వద్ద తమ పిల్లలను తెచ్చి తల్లిదండ్రులు వాటిలో ఎక్కించి ఆనందం పొందుతున్నారు. జాతరలో వెలిసిన దుకాణాలలో ఆట వస్తువులను, బొమ్మలను కొనుగోలు చేయడంతో పాటు స్త్రీల అలంకరణ వస్తువుల దుకాణాలలో తమకు కావాల్సిన వస్తువులను మహిళలు కొనుగోలు చేసుకుంటున్నారు. ఇదేకాకుండా జాతరలో ఏర్పాటు చేసిన స్టీల్, ఇత్తడి, అల్యుమినియడం,రాగి దుకాణాలలో ప్రజలు తమకు కావాల్సిన వస్తువులను కొనుగోలు చేసుకుంటున్నారు. జాతరకు వచ్చిన వారు హోటళ్లలో జిలేబి, బజ్జీలు రుచి చూడకుండా ఇండ్లకు తిరిగి వెళ్లడం లేదు. వారం రోజుల క్రితం ప్రారంభమైన జాతరకు ఇప్పుడిప్పుడేప్రజలు వస్తున్నారని వ్యాపారులు పేర్కొంటున్నారు.

'పదోన్నతులను వెంటనే చేపట్టాలి'

ఆదిలాబాద్‌అర్బన్, ఫిబ్రవరి23:బదిలీలు, పదోన్నతులను వెంటనే నిర్వహించాలని ఎస్టీయూ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్ అన్నారు. శుక్రవారం ఎస్టీయూ భవన్‌లో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం విద్యాశాఖకు గత పాలకుల కంటే ఎక్కువ నిధులు కేటాయించడం విద్యాభివృద్ధికి శుభసూచకమన్నారు. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఆమోదయోగ్యమైన పీఆర్‌సీని ప్రకటించే విధంగా ఎస్టీయూ టీఎస్ నుంచి ప్రాతినిధ్యం చేస్తామని తెలిపారు. అదే విధంగా మండలానికి ఒక తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ఏర్పాటు ప్రకటన, పేద బడుగు బలహీన వర్గాలు మైనార్టీలు సంపన్న వర్గాలలో ఉన్న పేదలకు నాణ్యతతో కూడిన ఉచిత విద్యను అందించడానికి ప్రభుత్వ నిర్ణయం ఎస్టీయూ పక్షాన స్వాగతిస్తున్నామన్నారు. అయితే ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి రాష్ట్రంలో అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయుల, విద్య పర్యవేక్షణాధికారుల కొరత వల్ల ఒకక ఎంఈఓకు నాలుగైదు మండలాల బాధ్యతలు అప్పగించడం వల్ల పాఠశాలల పర్యవేక్షణ సరిగ్గా జరగక వారికి తీవ్రపని ఒత్తిడి వల్ల మానసికమైన ఆందోళనకు గురవుతున్నారన్నారు. కార్య క్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెజ్జంకి రవీంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి జాదవఅశోక్, పూర్వ జిల్లా అధ్యక్షుడు చిలుక విలాస్ తదితరులున్నారు.

ఉపాధిహామీ పనుల్లో
కూలీల సంఖ్యను పెంచాలి : ఏపీడీ

బోథ్, ఫిబ్రవరి 23: ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని ఏపీడీ జగదేరావు సిబ్బంది ఆదేశించారు. 100 రోజులు పూర్తి కాని వారు ఎవరైనా ఉంటే ప్రస్తుతం జరుగుతున్న పనుల్లో చేరాలని కోరారు. శుక్రవారం మండలంలోని కంటేగాం, బాబేరా, గ్రామాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈసారి వేసవి కాలంలో సీసీటీల నిర్మాణంతోపాటు మట్టి కట్టలు రాళ్లకట్టల నిర్మాణం జరుగుతుందన్నారు. ప్రస్తుతం 2,100 మంది కూలీలు ఉన్నారని, గత ఏడాది 5వేల వరకు కూలీలు ఉపాధిహామీ పనులు చేశారని అన్నారు. గత ఏడాది మాదిరిగానే కూలీల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తున్నా మన్నారు. కార్మికులు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బ్యాంకుల సమ్మెతో నిలిచిపోయిన లావాదేవీలు

బోథ్, ఫిబ్రవరి 23: బ్యాంకుల సమ్మెతో శుక్రవారం మండలంలోని సోనాల బోథ్ కౌటా(బి), దన్నూర్ గ్రామాలలో సమ్మెతో వల్ల బ్యాంకులు మూసి ఉంచారు. ఈ విషయం తెలియని వినియోగదారులు డబ్బుల కోసం వచ్చి వెనుతిరిగి వెళ్లిపోవాల్సి వచ్చింది. మూడు రోజుల పాటు బ్యాంకులు మూసిఉండడంతో ఇబ్బందులు పడ్డారు.

పొచ్చెర, కోటా(బి)లో
అభివృద్ధి పనుల ప్రారంభం

బోథ్, ఫిబ్రవరి 23: మండలంలోని పొచ్చెర, కోటా(బి) గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద మంజూరైన రూ.5లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులను మార్కెట్ కమిటీ ఛైర్మన్ బొడ్డు గంగారెడ్డి ప్రారంభించారు. రానున్న రోజుల్లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ సహకారంతో పనులు చేపట్టడం జరుగుతు ందన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రవోజలొరెడ్డి, ఎంపీ టీసీ కుర్మ మహేందర్, మండల ప్రధాన కార్యదర్శి ఇట్టేడు రాజు రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పోశెట్టి అబ్బు, నేరడిగొండ నాయకులు ఏలేటి రాజశేఖర్, భూపెల్లి శ్రీధర్, వంశీ రెడ్డి ఉన్నారు.

నేడే భీమన్న జాతర

నేరడిగొండ, ఫిబ్రవరి 23: మండలంలోని బుగ్గారాం(బి)లో భీమన్న జాతరను శనివారం నిర్వహించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామ సమీపంలో గల కొండపై వెలసిన భీమన్న ఆలయంలో ప్రతీయేటా మాఘా పౌర్ణిమ రోజు పూజలు చేయడం వలన గ్రామంలో సుఖ శాంతులు నెలకొంటాయని గ్రామస్థులు తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లను చేపట్టారు.


తల్లుల ప్రసాదం కోసం ఎగబడుతున్న భక్తులు


తల్లుల దర్శనం కోసం క్యూ లైన్లలో బారులుదీరిన భక్తులు


తిరుగు ప్రయాణం కోసం ఆర్టీసీ క్యూ లైన్లలో జనం


తిరుగుపయనమైన భక్తులతో ఆర్టీసీ బస్టాండ్ క్యూలైన్లు, భక్తులను తరలించేందుకు సిద్ధంగా ఉన్న బస్సులు


మొక్కులు సమర్పించేందుకు వచ్చిన భక్తులతో కిక్కిరిసి పోయిన గద్దెల ప్రాంగణం

భక్త జన హోరు..

వనదేవతల రాకతో పోటెత్తిన భక్తులు ▸▸ నిరంతరాయంగా దర్శనాలు ▸▸ మొక్కులు చెల్లించుకున్న సీఎం, గవర్నర్



మేడారం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరలో మూడోరోజు శుక్రవారం కూడా భక్తులు జోరుగా మొక్కులు సమర్పించుకున్నారు. తల్లుల దర్శనాలు నిరంతరాయంగా కొనసాగుతుండగా తరలివస్తున్న భక్తులతో గద్దెల ప్రాంగణం పోటెత్తుతోంది. క్యూలైన్లన్నీ కిటకిటలాడుతున్నాయి. వీఐపీ ప్రవేశ ద్వారాల వద్ద కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వేచిచూస్తుండడంతో అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి. గురువారం రాత్రి సమ్మక్క గద్దెపైకి చేరుకున్న తర్వాత భక్తులు మొక్కులు చెల్లించుకోవడం మరింత జోరందుకుంది.

ప్రముఖుల తాకిడి

జాతరలో శుక్రవారం వీఐపీల తాకిడి పెరిగింది. ప్రముఖులంతా ఈ రోజే రావడంతో అధికారులపై ఒత్తిడి కనిపించింది. గవర్నర్ తమిళిసై సౌందరాజన్, కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండా, సీఎం రేవంత్ రెడ్డి సమ్మక్కను దర్శించుకొని మొక్కులను సమర్పించుకున్నారు. ఉదయం గవర్నర్‌తోపాటు కేంద్రమంత్రి ప్రత్యేక హెలికాప్టర్‌లో గద్దెల వద్దకు చేరుకున్నారు. ఎత్తుబంగారాన్ని తల్లులకు సమర్పించారు. పసుపు, కుంకుమ, గాజులు చీరెలను సమర్పించారు. మధ్యాహ్నం 2.30 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి







హెలికాప్టర్‌లో మేడారం చేరుకున్నారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, దనసరి అనసూయ, శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, ఎస్ఎస్‌వీ రెడ్డి, పాయం వెంకటేశ్వర్లు ప్రభుత్వ సీఎం శాంతికుమారి తదితరులతో కలిసి అమ్మవార్లను దర్శించుకున్నారు. అంతకుముందు మంత్రి సీతక్క సీఎంకు స్వాగతం పలకగా అధికారులు ఆలయ మర్యాదలతో గద్దెల వద్దకు తోడ్కొని వెళ్లారు. అలాగే రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తదితరులు తల్లులను దర్శించుకున్న వారిలో ఉన్నారు.

నేడు వన ప్రవేశం.. ముగియనున్న జాతర

గద్దెలపై కొలువుదీరి భక్తులకు ఆశీస్సులం దిస్తున్న వనదేవతలు శనివారం వనప్రవేశం చేయనున్నారు. దీంతో నాలుగు రోజుల పాటు వైభవంగా జరిగిన సమ్మక్క సారలమ్మ మహాజాతరకు తెరపడనుంది. శనివారం సాయంత్రం సుమారు 5 గంటలకు ప్రధాన పూజారి కొక్కెర క్రిష్ణయ్యతో పాటు మిగతా పూజారులు సమ్మక్క గద్దె వద్దకు చేరుకొని చివరి పూజలు చేసి.. తల్లి రూపాన్ని తీసుకొని చిలకలగుట్టపైకి తీసుకువెళ్లి నిజస్థానంలో ఉంచి వెనుదిరుగుతారు.

రెండవ రోజుకు చేరిన నిరసన



రిమ్స్ ఎమర్జెన్సీ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 23 : రిమ్స్, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రులలో పని చేస్తున్న శానిటేషన్ సెక్యూరిటీ గార్డ్స్ పేషేంట్ కేర్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రి ఎమర్జెన్సీ ఎదుట ఏఐటీయూసీ అనుబంధం తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు డోంగ్రెచందు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండీ ముజీబ్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ నెల 22 నుంచి ధర్నా గంట సేపు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా సిర్రదేవేందర్ మాట్లాడుతూ జీవో ఎంఎస్ నెంబర్ 60 ప్రకారం ఖతి కార్మికునికి ప్రతి నెల కార్మికుని అకౌంట్‌లో రూ.12093 వేయాల్సి ఉండగా కాంట్రాక్ట్ రూ.11వేలు ఇస్తూ రూ.1093 దోచుకుంటున్నారన్నారు. అలాగే పీఎఫ్ ప్రతి నెల ప్రతి కార్మికుని ఖాతాల్లో రూ.3023 జమ చేయాల్సి ఉండగా రూ.800లు రూ.1600 లోపు జమ చేసి మిగతా డబ్బులు దోచుకుంటున్నారన్నారు. అలాగే ఈఎస్ఐ రూ.484 జమ చేయాలి కాని 61 ఖాతాలో జమ చేసి రూ.423 దోచుకుంటున్నారని మండిపడ్డారు. వెంటనే సంబంధిత కాంట్రాక్టర్ స్పందించి వచ్చే నెల 6లోపు జీఓ ప్రకారం వేతనాలు పీఎఫ్, ఈఎస్ఐ కార్మికులకు ఇవ్వకపోతే ఆ రోజు వరకు ప్రతిర ఓజు గంట సేపు వినూత్న పద్ధతిలో నిరసనలు తెలిపి వచ్చే నెల 7 నుంచి కార్మికులందరుపనులు బహిష్కరించి సమ్మెకు పోవడానికి సిద్ధంగా ఉన్నారని సంబంధిత కృష్ణ ఏజెన్సీ యజమానిని హెచ్చరించారు.ఇందులో సంఘం రిమ్స్ బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి ఎండీ ఖాసీం, అధ్యక్షురాలు జి.సంగీత, కార్మికులు ఇమ్రాన్‌ఖాన్, రాము, రవి, గంగుఖదీర్, సునిత, రాజేందర్‌సింగ్, శివకేశ్ స్వామి, వెంకటేశ్, నర్సింగ్, సైఫ్‌ఖాన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆహార వ్యర్థాన్ని నియంత్రించే బాధ్యత ప్రతీ ఒక్కరిది

జైనథ్, ఫిబ్రవరి23: సమాజంలోని ప్రతిపౌరుడు తన అవసరం మేరకే ఆహారాన్ని వాడి ఆహార వ్యర్థాన్ని నియంత్రించే బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందని మేడిగూడ (ఆర్) ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సత్యవాన్‌చిక్టె అన్నారు. శుక్రవారం జైనథ్ మండలంలోని మేడిగూడప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులు వివిధ పిండివంటలతో చేసి ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు బయట దొరికే వివిధ ఆహారాలను వాడకుండా తమ ఇండ్లలో వంటి పౌష్టికాహారం పై ప్రతి ఒక్కరు దృష్టి సారించాలన్నారు. వివిధ ఆహారాల పై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మేడిగూడ (ఆర్) గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ క్యాతం రాంరెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ పి.అడెల్లు, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కొనిగెల నారాయణ, స్వేరోస్ జిల్లా అధ్యక్షులు పెంటపర్తి ఊశన్నలతో పాటు ఉపాధ్యాయులు గ్రామస్థులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో

హర్యానా ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 23 : యువ రైతు శుభకరణ్‌సింగ్‌ను పంజాబ్ బార్డర్‌లో కేంద్రం, హర్యానా రాష్ట్ర బీజేపీ ప్రభుత్వాలు క్రూరంగా హత్య చేయడాన్ని నిరసిస్తూ సీపీఎం ఆదిలాబాద్‌జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య కార్యాలయం వద్ద ప్రభుత్వాల దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర హోంమంత్రి, హర్యానా ముఖ్యమంత్రి పై హత్యానేరం మోపాలని, రైతాంగ ఉద్యమం పై నిర్బంధాన్ని ఆపి, కనీస మద్దతు ధరల చట్టం చేసి, రైతుల పై పెట్టిన కేసులు ఎత్తివేయాలని నినాదాలు చేశారు. అనంతరం సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొజ్జఆశన్న మాట్లాడుతూ అమరవీరుడు యువ రైతు శుభకరణ్ సింగ్‌కు జోహార్లు తెలిపారు. ఆయన స్ఫూర్తితో రైతు పోరాటాన్ని తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు. రైతుల పోరాటాన్ని అణిచి వేసేందుకే వ్యతిరేకంగా దేశం అంతటా రైతులను చైతన్యవంతం చేయాలని కోరారు. రైతుల నిరసన స్థలంలో రైతుల ట్రాక్టర్లను పోలీసులు ధ్వంసం చేశారన్నారు. రైతుల పై అణచి వేత ప్రయోగించడం, రైతు ఉద్యమాన్ని ఏకాకిని చేసి విభజించేందుకు కుట్ర పన్నారని, ఈ విభజనతో ఎన్నికల ప్రయోజనం పొందేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు.

వనదేవతలకు భక్తుల మొక్కులు




మొక్కు తీర్చుకుంటున్న భక్తురాలు.. మొక్కులు తీర్చుకోవడానికి తరలివచ్చిన భక్తులు

ముథోల్, ఫిబ్రవరి 23 : నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలోని ఎడ్‌బిడ్ తండాలో గల గుట్టలో వెలిసిన సమ్మక్క సారలమ్మ జాతర మూడవ రోజైన శుక్రవారం వనదేవతలకు భక్తులు మొక్కులు చెల్లించేందుకు తరలివచ్చారు. బాజాభజంత్రీల మధ్య బోనాలు, ఒడి బియ్యం తీసుకువచ్చి శ్రీ సమ్మక్క సారలమ్మ దేవతలకు సమర్పించారు. మొక్కిన మొక్కులు నెరవేరాలని భక్తులు అధిక సంఖ్యలో నిలువెత్తు బంగారం (బెల్లం) వనదేవతలకు సమర్పించారు.

కుంటాలలో ముగిసిన ఆలయ వార్షికోత్సవం


కుంటాలలో బోనాలతో ఆలయానికి వెళుతున్న మహిళలు


ఊరేగింపులో శివసత్తుల పూనకాలు

కుంటాల, ఫిబ్రవరి, 23 : కుంటాల మండల ప్రజల ఇలవెల్పు గజ్జలమ్మ ఆలయ వార్షికోత్సవం శుక్రవారంతో ముగిసింది. ఆఖరి రోజు నిత్యనిధి మహాపూర్ణ హారతి, కుంభాభిషేకం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గ్రామానికి చెందిన మహిళలు నెత్తిన బోనాలతో ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి గజ్జలమ్మకు ప్రీతిపాత్రమైన నైవేద్యాలతో మొక్కులు తీర్చుకున్నారు. ఊరేగింపులో శివసత్తుల పూనకాలు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావీయకుండా ఎస్ఐ హన్మండ్లు బందోబస్తు చర్యలు చేపట్టారు.

ఉపాధి పనుల అవకతవకలపై ప్రజావేదిక

కుభీర్, ఫిబ్రవరి, 23 : గ్రామాల్లో ఉపాధిహామీ పనులకు వెళ్లిన వందలాది మంది కూలీల జాబ్ కార్డులకు ఆధార్ అనుసంధానం కాకపోవడంతో కొందరు కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సామాజిక తనిఖీ ప్రజావేదిక ద్వారా స్పష్టమైందని జిల్లా అధికారి పేర్కొన్నారు. కుభీర్ మండలంలో 41 గ్రామ పంచాయతీలలో 1, ఏప్రిల్ 2022 నుంచి 2023 మార్చి వరకు జరిగిన సుమారు రూ. 8.20 కోట్ల విలువైన 392 ఉపాధిహామీ పనులపై ఈ నెలలో గ్రామాల్లో సామాజిక తనిఖీలు చేపట్టారు. అనంతరం కుభీర్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం సామాజిక తనిఖీ నివేదికలపై 14వ విడత ప్రజా వేదిక నిర్వహించారు. ప్రజా వేదిక ద్వారా డీఆర్‌పీలు చదివిన నివేదికలపై డీఆర్‌డీవో చర్యలు చేపట్టారు. వివిధ గ్రామాల్లో జరిగిన ఉపాధి పనుల్లో తప్పిదాలపై ఆరా తీశారు. పనులు చేపట్టిన కూలీలకు రూ. 5 కోట్ల 58 లక్షల 1980 చెల్లించినట్లు పేర్కొన్నారు. మండలంలోని 41 జీపీలకు గాను సాయంత్రం 6.30 గంటల వరకు 25 గ్రామపంచాయతీలకు సంబంధించిన నివేదికలు మా త్రమే చదివి వినిపించారు. కాగా మరో 15 గ్రామపంచాయతీలకు సంబంధించిన వివరాలు వెల్లడించాల్సి ఉంది. . ఈ కార్యక్రమంలో డీఆర్ డీవో విజయలక్ష్మీ, ఎంపీపీ



ప్రజావేదికలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో విజయలక్ష్మీ

తూము లక్ష్మీ, హెచ్ఆర్ సుధాకర్, గత ఎంపీడీవో రమేష్, అంబుడ్స్‌మెన్ నవీన్, ఆడిట్ అధికారి శివయ్య, ఎంపీడీవో శ్రీనివాస్, నాయకులు తూము రాజేశ్వర్, చౌహాన్ శంకర్, ఆయా గ్రామాల కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు, టీఏలు, తదితరులు పాల్గొన్నారు.

మునిపెల్లిలో

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


మునిపెల్లిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 23 : మండలంలోని మునిపెల్లి గ్రామంలో శుక్రవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. రూ. 5 లక్షల ఈజీఎస్ నిధుల ద్వారా ఈ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో డీఈ రాజేందర్, కాంగ్రెస్ నాయకులు కమల్‌కోట్ రాజారెడ్డి, చింతకింది, శేఖర్‌రెడ్డి, బొడ్డు మోహన్, కమల్‌కోట్ ముత్యంరెడ్డి, తదితరులు ఉన్నారు. దిలావర్‌పూర్, 02. విద్యార్థులు, ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న తహసీల్దార్

పదోతరగతిలో

మెరుగైన ఫలితాలు సాధించాలి

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 23 : పదో తరగతి వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని తహసీల్దార్ స్వాతి అన్నారు. మండలంలోని గుండంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులు సబ్జెక్టుల వారీగా విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు. విద్యార్థులు సైతం ప్రణాళికబద్ధంగా చదువుతూ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలన్నారు. మండలంలో పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు సిలారి మధుసూదన్, ఉపాధ్యాయులు ఉన్నారు.

మేడారం సమ్మక్క సారక్కను

దర్శించుకున్న ఎమ్మెల్యే


సమ్మక్క సారక్కను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

నేరడిగొండ, ఫిబ్రవరి23: మేడారం సమ్మక్క సారక్కను బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ దర్శించుకున్నారు. ములు జిల్లాలో ఉన్న ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర మేడారం సమ్మక్క సారక్కలను దర్శించుని పూజలు నిర్వహించారు. వీరితో పాటు బోథ్ నియోజక వర్గ ప్రజా ప్రతినిధులున్నారు.

ఘనంగా వీడ్కోలు సమావేశం

కుంటాల, ఫిబ్రవరి, 23 : మండలంలోని కల్లూర్ కస్తూర్బా గాంధీ పాఠశాలలో శుక్రవారం పదవ తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు.

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.7। కనిష్ఠం 17.4
నిర్మల్
జిల్లా వార్తలు
శనివారం 24 ఫిబ్రవరి 2024


రంజాన్ మాస సందర్భంగా
ట్రాఫిక్ చలాన్స్‌తో వేధించవద్దు


ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న ఎంఐఎం

● ఎస్పీకి ఎంఐఎం వినతి

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 23 : ఈ నెల 25న షబే బరాత్ పండుగ సందర్భంగా నిర్వహించే పవిత్ర జాగరణ, వచ్చే నెలలో రంజాన్ సందర్భంగా పలు వెసులుబాట్లు కల్పించాలని ఎంఐఎం నాయకులు అజీమ్ బీన్ యాహియా, రఫీక్ అహ్మద్ ఖురేషి, మొహమ్మద్ ఉస్మాన్, ఇంతియాజ్ తదితరులు ఎస్పీని కలిసి వినతిపత్రం అందజేశారు. వీధి వ్యాపారులపై ట్రాఫిక్ చలాన్స్ విధించవద్దని, అర్ధరాత్రి వరకు దుకాణాలు తెరిచి ఉంచేలా సహకరించాలని కోరారు. ఎస్పీ సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణకు తాము సహకరిస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

పోటా పోటీ



- ఎంపీ సీటు కోసం ప్రధాన పార్టీల్లో పెరుగుతున్న పోటీ
- మొదలైన నేతల హడావిడి
- ఈసారి బీజేపీలో భారీ పోటీ
- కాంగ్రెస్ నుంచి పెరుగుతున్న ఆశావహుల సంఖ్య
- బీఆర్ఎస్ పార్టీ నేతల వెనకడుగు

నిర్మల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : మరికొద్ది రోజుల్లోనే లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ జారీ కాబోతున్నట్లు సంకేతాలు వెలువడుతున్న నేపథ్యంలో అన్ని ప్రధానపార్టీలు ఆ దిశగా సమాయత్తమవుతున్నాయి. ముఖ్యంగా ప్రధానపార్టీల్లో టికెట్‌ల కోసం గత కొద్దిరోజుల నుంచే హడావిడి మొదలైంది. ఆయా పార్టీల నుంచి టికెట్‌లను ఆశిస్తున్న గిరిజన నేతలు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తుండడంతో జిల్లా రాజకీయ పరిణామాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి ఈసారి ఎక్కువ మంది గిరిజన నేతలు టికెట్‌లను ఆశిస్తున్నారు. కాగా ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నుంచి మాత్రం పోటీ చేసేందుకు నేతలంతా వెనకడుగు వేస్తుండడం ఆసక్తికరంగా మారుతోంది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి టికెట్‌ను ఎక్కువ సంఖ్యలో ఆశించిన నేతలు లోక్‌సభ ఎన్నికలకు వచ్చే సరికి ఓటమి కారణంగా పోటీకి సుముఖత వ్యక్తం చేయడం లేదంటున్నారు. దీని కారణంగా బీఆర్ఎస్ పార్టీ నుంచి ఈ సారి ఎంపీ టికెట్ కోసం పెద్దగా పోటీ ఉండకపోవచ్చని అంటున్నారు. అయితే గతానికి భిన్నంగా ఈ సారి బీజేపీ నుంచి దాదాపు పది మందికి పైగా గిరిజన నాయకులు టికెట్‌లను ఆశిస్తుండడం ఆసక్తికర పరిణామంగా పేర్కొంటున్నారు. జిల్లా నుంచి ఈసారి పలువురు గిరిజన నేతలు బీజేపీ టికెట్ కోసం ముమ్మరంగా సాగిస్తున్న ప్రయత్నాలు అంతటా చర్చకు తావిస్తున్నాయి. సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావు ఈ సారి కూడా బీజేపీ టికెట్ తమకే వస్తుందంటూ ధీమా వ్యక్తం చేస్తుండగా ఆయనను విభేదిస్తూ టికెట్‌ను ఆశిస్తున్న నేతలు మాత్రం భిన్నంగా వ్యాఖ్యానిస్తున్నారు. ఈ సారి బీజేపీ అధిష్టానం కొత్త నేతలకు అవకాశం ఇవ్వబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అధిష్టానం ఇప్పటికే కొత్త నేతల పేర్లను పరిశీలిస్తున్నట్లు పేర్కొంటున్నారు. కాగా సోయం బాపురావు మాత్రం టికెట్ తనకే వస్తుందంటూ తన అనుచరులకు స్పష్టం చేస్తున్నట్లు చెబుతున్నారు. దీనికి అనుగుణంగానే ఆయన జిల్లాలో జరిగిన కొమురం భీం విజయ సంకల్పయాత్రను తానే ముందుండి నడిపారు. బాసర నుంచి మొదలుకొని ఆసిఫాబాద్ వరకు సోయం బాపురావు యాత్రకు సంబంధించిన ఏర్పాట్లతో పాటు స్థానిక నేతలతో సమన్వయం, జనసమీకరణ వ్యవహారాలను పర్యవేక్షించారంటున్నారు. ఇదిలా ఉండగా భైంసాకు చెందిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్ బాబు ఈ సారి ఎలాగైనా టికెట్‌ను దక్కించుకునేందుకు అన్ని రకాల ప్రయత్నాలు సాగిస్తున్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అధిష్టానం లోక్‌సభ టికెట్‌కు సంబంధించి తనకు హామీనిచ్చిందంటూ వెల్లడిస్తున్నారు. అధిష్టానం తనకు స్పష్టమైన హామీనివ్వడంతోనే తాను ఇప్పటికే పోటీకి సంబంధించిన ప్రయత్నాలను కూడా మొదలుపెట్టానని ఆయన పేర్కొంటున్నారు. ఈ క్రమంలోనే మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ కూడా ఈ సారి లోక్‌సభ బరిలో నిలిచేందుకు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగానే ఆయన స్థానికంగా పర్యటనలు జరుపుతూ రాష్ట్ర, జాతీయస్థాయి నాయకులతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతుండడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. ఈ సారి టికెట్ తననే వరించబోతోందంటూ రాథోడ్ రమేష్ తన అనుచరులకు వివరిస్తూ ముందస్తు ఏర్పాట్లకు సిద్ధమవుతున్నారు. ఈయనతో పాటు అభినవ్ సర్దార్ కేతావత్ కూడా టికెట్ కోసం తన వంతు ప్రయత్నాలు ముమ్మరంగా సాగిస్తున్నారు. అలాగే డాక్టర్ రాహుల్ నాయక్ కూడా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ తరపున టికెట్‌ను ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

● బీజేపీలో హోరాహోరీ

లోక్‌సభ ఎన్నికల టికెట్ కోసం బీజేపీ పార్టీలో చాలా మంది సీనియర్ నాయకులు పోటీ పడుతున్న కారణంగా టికెట్ కేటాయింపు వ్యవహారం ఆ పార్టీకి ఇబ్బందులు సృష్టించే అవకాశాలు లేకపోలేదంటున్నారు. సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావు ఈ సారి కూడా తనకే టికెట్ వస్తుందంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఇప్పటికే ఆయన అధిష్టానం నుంచి టికెట్ కేటాయింపుకు సంబంధించిన స్పష్టమైన హామీని కూడా పొందినట్లు చెబుతున్నారు. అయితే సోయం బాపురావు టికెట్ విషయంలో ధీమాగా ఉండడం టికెట్‌ను ఆశిస్తున్న నేతల్లో చర్చకు తావిస్తోంది. ఈయనతో పాటు మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ సైతం బీజేపీ టికెట్ విషయంలో తన అనుచరుల వద్ద ధీమా వ్యక్తం చేస్తుండడం ఆసక్తికర పరిణామమవుతోంది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ముథోల్ నియోజకవర్గ పార్టీ అభ్యర్థి రామారావు పటేల్ గెలుపు కోసం కృషి చేసిన రాజేశ్‌బాబు సైతం అధిష్టానం టికెట్ విషయంలో ముందుగానే తనకు సంకేతాలు ఇచ్చిందంటూ సంకేతాలు వ్యక్తం చేస్తున్నారు. అలాగే సినీనటుడు అభినవ సర్దార్ కేతావత్ సైతం టికెట్ విషయంలో పార్టీ పెద్దలు తనకు భరోసా కల్పించారని పేర్కొంటున్నారు. అలాగే ఓ ప్రభుత్వ డాక్టర్ రాహుల్‌నాయక్ సైతం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కోటాలో ఈ సారి తనకే టికెట్ వస్తుందంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు.

● కాంగ్రెస్ నుంచి హేమాహేమీలు

లోక్‌సభ టికెట్ కోసం ఈ సారి కాంగ్రెస్ పార్టీలో సైతం ఆ పార్టీ నేతలు తీవ్రంగా పోటీ పడుతున్నారు. ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్‌తో పాటు ఆమె భర్త శ్యాంనాయక్ అలాగే ఓ ఐఆర్ఎస్ అధికారి ప్రకాష్ రాథోడ్, నరేష్ జాదవ్‌తో పాటు ఆదివాసీ మహిళ నేత ఆత్రం సుగుణక్క తదితరులు ఈ సారి కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం పట్టుబడుతున్నారు. అయితే మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ ఆమె భర్త శ్యాం నాయక్‌లు తామిద్దరిలో ఒకరికి టికెట్ ఇవ్వాలని అధిష్టానానికి వివరించినట్లు సమాచారం. అయితే ఆదివాసీ తెగకు చెందిన ఆత్రం సుగుణక్క, ఐఆర్ఎస్ అధికారి ప్రకాష్ రాథోడ్‌లు అధిష్టానంతో తమకున్న సంబంధాలను అస్త్రంగా మలుచుకొని టికెట్‌పై ధీమా వ్యక్తం చేస్తున్నారు.

● బీఆర్ఎస్ టికెట్ కోసం నేతల వెనకడుగు

మొన్నటి అసెంబ్లీ ఎన్నికల వరకు ఊపుమీదున్న బీఆర్ఎస్ పార్టీ ఓటమితో పూర్తిగా డీలా పడిపోయింది. ఈ సారి లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ నుంచి పోటీ చేసేందుకు సీనియర్ గిరిజన నేతలు వెనకడుగు వేస్తుండడం ఆసక్తికరంగా మారుతోంది. ఒకరిద్దరు మినహా ఏ గిరిజన నేత కూడా బీఆర్ఎస్ పార్టీ టికెట్ కోసం ప్రయత్నాలు చేయడం లేదంటున్నారు. ఇదే జరిగితే మొన్నటి ఎన్నికల్లో ఖానాపూర్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన కేటీఆర్ సన్నిహితుడు భుక్య జాన్సన్‌నాయక్‌కే తిరిగి టికెట్ ఇచ్చేందు కోసం బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం సిద్ధమవుతోందంటున్నారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి పెద్దగా పోటీ లేని కారణంగా లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ పెద్దగా ప్రభావం చూపే అవకాశాలు లేకపోలేదంటున్నారు.

కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యానందిత
మృతి పట్ల మాజీ మంత్రి సంతాపం

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 23 : కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్యానందిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పట్ల మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సంతాపం ప్రకటించారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె ఆత్మకు శాంతి కలగాలని కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఎంతో భవిష్యత్ గల ఎమ్మెల్యే మృతి తనను కలచివేసిందని పేర్కొన్నారు.

వైద్య, ఆరోగ్య ఉద్యోగుల
డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ


డైరీని ఆవిష్కరిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ధనరాజ్

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 23 : జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఉద్యోగుల సంఘం ఐఎన్‌టీయూసీ - 3194 డైరీ, క్యాలెండర్‌లను జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధనరాజ్ శుక్రవారం ఆవిష్కరించారు. జిల్లా అధికారుల సమీకృత కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వైద్య, ఆరోగ్య ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణమోహన్‌గౌడ్, కార్యదర్శి కన్నయ్య, నాయకులు భోజారెడ్డి, రవీందర్, శ్రీనివాస్ రెడ్డి, రమణా రెడ్డి, సురేష్‌రెడ్డి, పురుషోత్తం, శాంత, ఉమారాణి, సుమతి, నుస్రత్, శోభ, సునీత, గంగా, మురళి, రమణ, కార్యాలయ సూపరింటెండెంట్ పురుషోత్తం, సంతోష్, శేషు, మహేందర్ పాల్గొన్నారు.

మహాసభలను
విజయవంతం చేయాలని కరపత్రాల ఆవిష్కరణ

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 23 : తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర మహాసభల కరపత్రాలు శుక్రవారం జిల్లా సంఘం ఆవిష్కరణ చేశారు. రేపు హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో జరిగే సభలకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. నేరెళ్ల హన్మంతు, దేవరావు, భీమేష్, జగదీశ్వర్, సంపత్ పాల్గొన్నారు.

ఘనంగా రథసప్తమి ముగింపు వేడుకలు


రథ సప్తమి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

నర్సాపూర్(జి), ఫిబ్రవరి 23 : మండల కేంద్రంలో వారం రోజులుగా కొనసాగుతున్న రథ సప్తమి వేడుకలు శుక్రవారం ముగింపు కార్యక్రమంలో తాళ సప్త, అభిషేకం, సిందూర అర్చన, గోపాల కాలువ, ఉట్టికొట్టే కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో ఊరేగింపుగా వెళ్ళి ఆలయాల్లో ప్రత్యేక పూజలను వేద పండితులు నరహరి శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ అర్గుమీదిరాంరెడ్డి, జడ్పీటీసీ అర్గుమీది రామయ్య, యంపీపీ కొండ్ర రేఖారమేష్, గ్రామ పెద్దలు ప్యాట్ల రాజారెడ్డి, బొల్లి గంగారాం, సుభా ష్, ధృపతిరెడ్డి, శ్రీదర్, ప్రవీన్, పరికిపండ్ల గంగారాంలు పాల్గొన్నారు.

గంగ స్నానానికి బయలుదేరిన పెద్దమ్మ తల్లి గజాలు


గంగ స్నానానికి బయలుదేరుతున్న పెద్దమ్మ తల్లి

పెంబి, ఫిబ్రవరి 23 : మండలంలోని మందపల్లి గ్రామంలో గల శ్రీ పెద్దమ్మ తల్లి గజాలు శుక్రవారం గంగస్నానానికి బయలుదేరాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ, ముదిరాజ్ సంఘం సభ్యులు మాట్లాడుతూ... గత రెండు రోజులుగా గ్రామంలో తిరుగుతూ శుక్రవారం గంగ స్నానానికి పెద్దమ్మ గజాలు బయలుదేరాయని అలాగే అదే మళ్లీ గుడికి చేరుకొని ఆదివారం పెద్దమ్మతల్లి కల్యాణం, జాతర అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు జాతరకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా సంత్‌గాడ్గే బాబా జయంతి


సంత్‌గాడ్గే బాబా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

భైంసా, ఫిబ్రవరి 23 : పట్టణంలోని బుద్ధవిహార్, విశ్రాంతి భవన ప్రాంతాల్లో వివిధ సంఘాలు, సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం సంత్ గాడ్గేబాబా 148వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుద్ధవిహార్‌లో ది బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించగా బహుజన ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విశ్రాంతి భవన సమీపంలో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా సంత్‌గాడ్గే బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక విశ్రాంతి భవనం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో సంత్ గాడ్గేబాబా అవార్డు గ్రహిత సుంకెట పోశెట్టి, ఆర్‌పీఐ ప్రతినిధి దేవిదాస్ హన్స్‌, దళితసేన ప్రతినిధి యశ్వంత్ బన్సోడే, రజక సంఘం ప్రతినిధి సుంకెట శ్రీనివాస్‌లు మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషిని కొనియాడారు. సామాజిక సంఘ సంస్కర్తగా సంత్ గాడ్గే బాబా అధ్యాత్మిక చైతన్యం, కుల నిర్మూలన, విద్యాదానం, పరిసరాల పరిశుభ్రత, అంటరానితనం తదితర సామాజిక కార్యక్రమాలు చేపట్టి ఉద్యమంగా వాటిని కొనిసాగించారని పేర్కొన్నారు. ఆయన అడుగుజాడలో ప్రస్తుత సమాజం, ప్రభుత్వాలు పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు ఆకాంక్షించారు.

విశ్వకర్మ పథకం కులవృత్తుల వారికి ప్రయోజనం


సమావేశానికి హాజరైన అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 23 : ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం కులవృత్తుల వారికి ప్రయోజనకరంగా ఉంటుందని అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్ అన్నారు. శుక్రవారం పరిశ్రమలశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈ పథకం ద్వారా ఐదుశాతం వడ్డీకి రుణసౌకర్యం పొందవచ్చునన్నారు. సబ్సిడీ లభిస్తుందని తెలిపారు. కులవృత్తులు చేసుకునే వారికి శిక్షణ, మార్కెటింగ్‌తో పాటు నైపుణ్యాభివృద్ధి చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ పథకానికి 18 రకాల చేతివృత్తుల వారు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. కుటుంబంలో ఒకరు మాత్రమే అర్హులన్నారు. మొదటి విడత లక్ష రూపాయల రుణం మంజూరవుతుందన్నారు. రుణమొత్తాన్ని 18 నెలల్లో చెల్లించాల్సి ఉంటుందన్నారు. రెండో విడత రెండు లక్షల రుణ మంజూరు జరుగుతుందన్నారు. దీన్ని 30 నెలల్లో చెల్లించాలన్నారు. అర్హత గల కులవృత్తుల వారు ప్రాథమిక శిక్షణలో భాగంగా గుర్తించబడిన నైపుణ్యాల్లో శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ సమయంలో లబ్ధిదారులకు రూ.500లు చెల్లిస్తారన్నారు. ఈ సమావేశంలో ఎంఎస్‌ఎం ఈడీఎఫ్‌వో నవీన్ కుమార్, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ నర్సింహారెడ్డి, ఎల్‌డీఎం చంద్రశేఖర్, మెప్మా పీడీ సుభాష్, అధికారులు పాల్గొన్నారు.

ప్రతీ మహిళ ఆర్థికంగా ఎదగాలన్నదే ప్రభుత్వం లక్ష్యం : డీపీఎం


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీపీఎం విజయలక్ష్మి

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 23 : ప్రతీ మహిళా ఆర్థికంగా ఎదగడం ద్వారా లక్షాధికారి కావలన్నదే ప్రభుత్వం లక్ష్యమని డీపీఎం విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం ఐకేపీ సిబ్బందికి మండల సమాఖ్య భవనంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మహిళ పూర్తి వివరాలు ఈ లక్పతి దీదీయాప్‌లో నమోదు చేయాలన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా ఇందిరాక్రాంతి పథం ఆధ్వర్యంలో రూపొందించిన లక్పతిదీదీయాప్‌పై ఈ కార్యక్రమంలో నర్సాపూర్, దిలావర్‌పూర్ మండలాలకు చెందిన ఏపీఎం, సీసీలు, వీవోఏలకు యాప్‌పై రెండు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో ఏపీఎంలు సులోచనరెడ్డి, సునంద, సీసీలు సాయన్న, పోశెట్టి, ముత్యం, సందేశ్, రెండు మండలాల వీవోఏలు పాల్గొన్నారు.

మహారాష్ట్రలో ఓబీసీ ఆందోళనలతో
నిలిచిన అంతరాష్ట్ర బస్సు సర్వీసులు

భైంసా, ఫిబ్రవరి 23 : మహరాష్ట్రలో ఒబీసీ కల్పన విషయంలో ఆందోళనలు తీవ్రతరమయ్యాయి.ఇందులో భాగంగానే అక్కడ బస్సుల ధ్వంసం, దహనాలు జరుగుతున్నాయి. దీంతో నిర్మల్, భైంసా డిపోల పరిధి నుంచి మహారాష్ట్రకు వెళ్లే అంతరాష్ట్ర బస్సు సర్వీసులను టీఎస్ ఆర్‌టీసీ అధికారులు రద్దు చేశారు. గత వారం రోజులుగా అక్కడ ఆందోళనలు అధికమయ్యాయి. దీంతో అక్కడి ప్రభుత్వం అధిక శాతం రూట్లలో బస్సుల రాకపోకలను నిలిపివేసింది. సంబంధిత సమాచారం అందుకున్న నిర్మల్, భైంసా బస్సు డిపో అధికారులు మహారాష్ట్రకు ఇక్కడి నుంచి నడిపే బస్సు సర్వీసులన్నీ రద్దు చేశారు. భైంసా బస్సు డిపో నుంచి నాందేడ్, ధర్మాబాద్, హిమాయత్‌నగర్ ప్రాంతాలకు, నిర్మల్ నుంచి నాందేడ్ ప్రాంతానికి నడిచే బస్సు సర్వీసులన్నింటినీ అధికారులు నిలిపివేశారు. మహారాష్ట్రలో ఆందోళనలు తగ్గుముఖం పట్టిన తర్వాతే అంతర్‌రాష్ట్ర సర్వీసలు పునరుద్ధరిస్తామని భైంసా బస్సు డిపో అధికారులు పెర్కొన్నారు. అంతరాష్ట్ర బస్సు సర్వీసుల నిలిచిపోవడంతో ప్రయాణీకులు పాట్లు పడుతున్నారు. భైంసా నాందేడ్, ధర్మాబాద్ ప్రాంతాలకు నిత్యం వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు నిర్వహిస్తుంటారు. నాందేడ్‌కు అధిక శాతం మంది ప్రయాణీకులు వైద్య సేవల విషయంలో, ధర్మాబాద్ ప్రాంతానికి క్రయ, విక్రయాల నిమిత్తం రాకపోకలు అధికంగా ఉంటాయి. ప్రస్తుతం ఈ రూట్లలో బస్సులు నిలిచిపోవడంతో ప్రయాణికులు ప్రత్యామ్నాయ చర్యలు, ప్రైవేట్ వాహనాల ద్వారా అవస్థలు పడుతూ రాకపోకలు జరుపుతున్నారు.



భైంసాలో నిలిచిపోయిన అంతర్ రాష్ట్ర బస్సు సర్వీసు

సంక్షిప్త సమాచారం

ఓటు హక్కు ఎంతో విలువైనది



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న డీఆర్‌డీవో

కుంటాల, ఫిబ్రవరి, 23 : ఓటు హక్కు ఎంతో విలువైనదని, ఓటు హక్కును సద్వినియోగపరుచుకోవాలని డీఆర్‌డీవో విజయలక్ష్మీ అన్నారు. శుక్రవారం ఓటు హక్కు ప్రాధాన్యతలో భాగంగా కుంటాల మండలంలోని కల్లూర్ వాసవి కళాశాల విద్యార్థులకు ఓటు హక్కు నమోదు చేసుకునే విధానం, ఓటు హక్కు ప్రాధాన్యత, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఆర్ మేనేజర్ సుధాకర్, ఫైనాన్స్ మేనేజర్ సందీప్, సీసీ గంగాధర్, ఏపీవో నవీన్, ఏపీఎం అశోక్, కళాశాల ప్రిన్సిపాల్ సాయిలు, శ్రీనివాస్ ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి



కుంటాల, ఫిబ్రవరి, 23 : కాంగ్రెస్ పార్టీ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని ముథోల్ మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు పటేల్ అన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన నిధులతో సీసీ రహదారుల పనులను పలు ప్రజా ప్రతినిధులచే ప్రారంభించారు. మండలంలోని అందకూర్, ఓల, లింబా (బీ), లింబా (కే) గ్రామాలలో అక్కడి ప్రజా ప్రతినిధులచే సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా అందకూర్ గ్రామానికి చెందిన ఎంపీటీసీ మధు బీఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి చేశారు. ఆయనకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జుట్టు అశోక్, భోజరాం పటేల్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్‌తో పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పలువురు పాల్గొన్నారు.

సోఫీనగర్
పారిశ్రామికవాడ కార్యవర్గం ఏర్పాటు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 23 : సోఫీనగర్ పారిశ్రామికవాడ కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మేడిసెమ్మె రాజు, ఉపాధ్యక్షుడిగా మంత్రి రాజగోపాల్, ప్రధాన కార్యదర్శిగా అంపోలి మురళీధర్‌రెడ్డి, కోశాధికారిగా శాంతిలాల్ పాటిల్‌తో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. టీఎస్ఐఐసీ అధికారులు శివప్రసాద్, దినేష్ హాజరయ్యారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ముథోల్, ఫిబ్రవరి 23 : మండల కేంద్రమైన ముథోల్‌లో శనివారం ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాబోయే రోజుల్లో మెరుగైన విద్యుత్ సరఫరా అందించడంలో భాగంగా విద్యుత్ వైర్లు, స్తంభాల మరమ్మతులు జరుగుతున్న దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. దీనికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.